



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

ఆదివారం 6 జూలై 2025 పేజీలు 8


# స్వర్ణాంధ్ర సాకారానికి గట్టి పునాదులు

- శాఖలవారీగా వృద్ధికి అవకాశమున్న అంశాలతో జిల్లా, నియోజకవర్గ ప్రణాళికలు
- వనరులు, బలాలు, సవాళ్లు ఆధారంగా రూపకల్పన
- 2047 నాటికి రూ. 18.23 లక్షల కోట్ల జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ) లక్ష్యం
- పశు సంవర్ధక, ఉద్యాన, ఎంఎస్ఎంఈ, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి
- శూన్య పేదరికం నుంచి డీప్ టెక్ వరకు పది సూత్రాలకు ప్రాధాన్యం
- క్వాంటం వ్యాలీ అనుబంధ కార్యకలాపాలపైనా చొరవ
- జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, జిల్లా దార్శనిక ప్రణాళిక యూనిట్ ఛైర్మన్ సత్యకుమార్ యాదవ్




**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్రకు కీలకభాగస్వామ్యం లక్ష్యంగా అందుబాటులో ఉన్న వనరులు, బలాలు, సవాళ్లు ఆధారంగా ఎన్‌టీఆర్ జిల్లా, నియోజకవర్గాల దార్శనిక కార్యాచరణ ప్రణాళికల ముసాయిదాలను తయారు చేశామని.. 2047 నాటికి రూ. 18.23 లక్షల కోట్ల జీడీడీపీని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, జిల్లా దార్శనిక కార్యాచరణ ప్రణాళిక యూనిట్ ఛైర్మన్ సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన జిల్లా, నియోజకవర్గ దార్శనిక ప్రణాళికలు, స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), గద్దె రామ్మోహన్, కొలికపూడి శ్రీనివాసరావు, బోండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్, కేడీసీసీ ఛైర్మన్ నెట్టెం రఘురామ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు. జిల్లా ప్రణాళికపై కలెక్టర్ లక్ష్మీశ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ప్రణాళికలను ఆయా నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధికి అవకాశమున్న అంశాలు, కీలక ప్రగతి

2 లో

గృహ నిర్మాణ నిర్ణీత లక్ష్యాలను సాధించేందుకు

# ప్రత్యేక దృష్టి సారించాలి

కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో గృహ నిర్మాణం చాలా వెనుకబడి ఉందని నిర్ణీత లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరం లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణం, స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్, పి 4 కార్యక్రమాలపై క్షేత్రాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10,007 ఇళ్ల నిర్మాణం జరగాల్సి ఉండగా ఇప్పటివరకు 3,603 ఇల్లు పూర్తయ్యాయన్నారు. గత జూన్ నెలలో సమావేశం జరిగినప్పుడు 2,558 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం కాగా కేవలం 179 ఇల్లు నిర్మాణం మాత్రమే పూర్తి చేశారన్నారు. గత సమావేశం నుండి ఇప్పటివరకు పైకప్పు స్థాయి నుండి రూఫ్ క్యాస్టింగ్ వరకు కేవలం 148 ఇల్లు మాత్రమే వచ్చాయన్నారు. గృహ నిర్మాణంలో సరైన పురోగతి కనిపించడం లేదని ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత లక్ష్యాల మేరకు వచ్చే సమావేశం ఈనెల 19వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఇళ్ల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం గురించి అవగాహన కలిగించి ఇళ్ల నిర్మాణం పురోగతిని సాధించాలన్నారు. జిల్లా మొత్తం లక్ష్యాలను ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కష్టపడి పనిచేసి ఇళ్ల నిర్మాణ పనుల బిల్లులు వెంటనే అప్లోడ్ చేయాలని ముందస్తుగా ఎవరికి బిల్లుల చెల్లింపు చేయరాదన్నారు.

మిగతా 2లో...

# మునగ సాగుతో రైతుకు ఆర్థిక బాసట



- ఉపాధి హామీలో ఉచితంగా పంట సాగుకు సహాయం
- రెండు వరుసల్లో మునగ పంట పెంపకానికి శ్రీకారం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**నందిగామ, జులై 05, మేజర్ న్యూస్ :** ప్రస్తుత పరిస్థితుల్లో మునగ సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని.. ఈ నేపథ్యంలో అన్నదాతలు ఉపాధి హామీ పథకం సహాయంతో మునగసాగు చేపట్టి, ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ శనివారం నందిగామ మండలం, సోమవారం గ్రామంలో ఓ రైతు పొలంలో మునగ విత్తనాలు నాటి రెండు వరుసల్లో మునగ పంట పెంపకం పద్ధతికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మునగ సాగును ప్రధాన పంటగా లేదా పొలం గట్ల వెంబడి చుట్టూ అంతర పంటగా చేపట్టవచ్చని తెలిపారు. ప్రత్తి, మిరప, మొక్కజొన్న, కూరగాయలు పండించే రైతులు వారి పొలం చుట్టూ రెండు వరుసల్లో ఎకరానికి 190 మొక్కలు నాటితే ఉపాధి హామీ పథకం నుంచి రెండేళ్లకుగాను పూర్తి ఉచితంగా రూ. 31 వేల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ మొక్కల ద్వారా దాదాపు రూ. 1,50,000 అదనపు ఆదాయం పొందొచ్చన్నారు. ఎకరంలో మునగను ప్రధాన పంటగా సాగుచేస్తే 448 మొక్కలకుగాను ఉపాధి హామీ పథకం నుంచి రెండేళ్లకు రూ. 94,275 ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. దీనిద్వారా ఎలాంటి పెట్టుబడి లేకుండా రూ. 2.60 లక్షల నుంచి రూ. మూడు లక్షల వరకు ఆదాయం పొందొచ్చన్నారు. పూర్తి వివరాలకు ఎంపీడీవో/ఉపాధి హామీ ఏపీవో,

మిగతా 2లో...

# మోడీ ప్రభుత్వ దృఢ సంకల్పానికి 'ఆపరేషన్ సిందూర్' అత్యుత్తమ ఉదాహరణ






**విజయవాడ మేజర్ న్యూస్ :** కేంద్ర హోంమంత్రి, సహకార మంత్రి అమిత్ షా, గొప్ప చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన తరుణంలో, పూణేలోని ప్రతిష్టాత్మక జాతీయ రక్షణ అకాడమీ (ఎన్డీఏ)లో ప్రఖ్యాత మరాఠా కమాండర్ శ్రీమంత్ బాజీరావు పేష్వా I విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ చర్య పేష్వా బాజీరావు యొక్క అసమానమైన పరాక్రమాన్ని గౌరవించడమే కాకుండా, జాతీయ రక్షణ, సాంస్కృతిక వారసత్వం పట్ల మోడీ ప్రభుత్వ లోతైన నిబద్ధతను కూడా సూచిస్తుంది. 'ఆపరేషన్ సిందూర్' వెనుక ఉన్న ధైర్యాన్ని గుర్తుచేసుకుంటూ, అమిత్ షా, "ఈ ఆపరేషన్ మోడీ ప్రభుత్వ వ్యూహాత్మక స్పష్టతకు, స్వరాజ్‌ను రక్షించాలనే మన అచంచలమైన సంకల్పానికి నిదర్శనంగా నిలుస్తుంది" అని వ్యాఖ్యానించారు. ఇది సరిహద్దుల వద్ద భారతదేశం యొక్క శక్తిని ప్రదర్శించడం మాత్రమే కాదు, నిర్ణయాత్మక నాయకత్వంలో భారతదేశం ఇప్పుడు బలం, దృఢ నిశ్చయంతో తన గౌరవాన్ని కాపాడుకునే దేశం అని స్పష్టమైన సందేశం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికత 'వికాస్ భీ, విరాసత్ భీ' (వారసత్వంతో పాటు అభివృద్ధి) సమతుల్య జాతీయ మార్గాన్ని ప్రతిబింబిస్తుంది, ఇది దేశం యొక్క అద్భుతమైన గతాన్ని పునరుజ్జీవింపజేస్తూ ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుంది. ఈ దార్శనికత ప్రకారం, శతాబ్దాలుగా భారతదేశ స్ఫూర్తిని తీర్చిదిద్దిన ఆ చారిత్రక వ్యక్తుల గొప్ప వారసత్వాన్ని మన యువత, సైనికులకు పరిచయం చేయడం చాలా ముఖ్యం. ఎన్డీఏలో బాజీరావు పేష్వా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఒక ఉత్సవ కార్యక్రమం కంటే ఎక్కువ, ఇది భారతదేశ భవిష్యత్ నాయకులు గతంలోని వీరత్వం, వ్యూహాత్మక వైభవం నుండి ప్రేరణ పొందాలని ఒక ప్రకటన. శ్రీమంత్ బాజీరావు పేష్వా I భారత చరిత్రలో గొప్ప సైనిక కమాండర్లలో ఒకరిగా కొనసాగుతున్నారు. ఆయన తన జీవితకాలంలో 41 యుద్ధాలు చేశారు, ఒక్క యుద్ధంలోనూ ఓడిపోలేదు. ఆయన నాయకత్వం మరాఠా సామ్రాజ్య ప్రభావాన్ని ఉత్తర భారతదేశంలో లోతుగా విస్తరించింది, ఆయన వేగవంతమైన, ధైర్యమైన వ్యూహాలను సైనిక వ్యూహంలో అధ్యయనం చేయడం కొనసాగుతోంది. ఎన్డీఏ వంటి సంస్థలో ఆయన విగ్రహాన్ని ఉంచడం ద్వారా, భారతదేశం తన స్వంత గర్వించదగిన చరిత్ర యొక్క పాఠాల నుండి నేర్చుకుంటూ ముందుకు సాగుతోందని మోడీ ప్రభుత్వం నొక్కి చెబుతోంది. "ఈ ప్రభుత్వానికి, సాంస్కృతిక గౌరవాన్ని, యుద్ధ వారసత్వాన్ని గౌరవించడం పరిపాలనతో సమానం" అని అమిత్ షా నొక్కిచెప్పారు. స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాలుగా, భారతదేశపు చాలా మంది వీరులను పక్కన పెట్టారు లేదా మరచిపోయారు. కానీ ప్రధానమంత్రి మోడీ జాతీయ జ్ఞాపకార్థం వారి సరైన స్థానాన్ని పునరుద్ధరించడానికి స్థిరమైన చర్యలు తీసుకున్నారు, అది స్టేడియాలకు మేజర్ ధ్యాన్ చంద్ పేరు మార్చడం, భగత్ సింగ్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను ఏర్పాటు చేయడం లేదా ఇప్పుడు వీర్ సావర్కర్, బాజీరావు పేష్వా వంటి పరాక్రమవంతులను అమరత్వం చేయడం వంటివి కావచ్చు. ఎన్డీఏ వద్ద బాజీరావు విగ్రహం ఉండటం దేశాన్ని రక్షించడం అంటే అధునాతన ఆయుధాల గురించి మాత్రమే కాదు, అంతర్గత బలం, సాంస్కృతిక అవగాహన, సేవ చేయడానికి దృఢ సంకల్పం గురించి కూడా గుర్తు చేస్తుంది. భారతీయత, సంప్రదాయం, సాంకేతికత చేయి చేయి కలిపి ముందుకు సాగే ఈ సినర్జీని మోడీ ప్రభుత్వం రూపొందిస్తోంది. బాజీరావు పేష్వా విగ్రహం కేవలం గతానికి నివాళి మాత్రమే కాదుబీ ఇది భవిష్యత్తుకు ప్రతిజ్ఞ. ఆపరేషన్ సిందూర్ నుండి 'వికాస్ ఔర్ విరాసత్' మంత్రం వరకు, మోడీ-షా నాయకత్వం భారతదేశాన్ని స్వావలంబన, ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ దేశంగా మారడానికి మార్గనిర్దేశం చేస్తూనే ఉంది. వారు భారతదేశ చారిత్రక చైతన్యాన్ని కాపాడటమే కాకుండా జాతీయ మనస్సులో దానిని తిరిగి రగిలించారు. ఈ సంకల్పమే నవ భారతదేశాన్ని రూపొందిస్తోంది, ఇక్కడ సంప్రదాయం, ఆధునికత కలిసి ఉంటాయి, ఇక్కడ ధైర్యవంతులు గుర్తుంచుకుంటారు, దేశ సార్వభౌమత్వాన్ని బెదిరించే వారికి దృఢమైన ప్రతిస్పందన లభిస్తుంది.

# విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ధర్నా

**జగ్గయ్యపేట,జులై 5, మేజర్ న్యూస్.:** రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ భారాన్ని తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ (సి పి ఐ) ఆధ్వర్యంలో డిపో సెంటర్ లో ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజీ శివాజీ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాస్ రావులు మాట్లాడుతూ సామాన్య ప్రజలపై దాదాపుగా 1500 కోట్ల విద్యుత్ భారాన్ని మోపుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అదానితో జరిపిన విద్యుత్ ఒప్పందాలని రద్దు చేసుకొని స్మార్ట్ మీటర్లు ఏర్పాట్లు కూడా విరమించుకోవాలని లేదంటే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని పేర్కొన్నారు. అధికారం కోసం అమలుకు సాధ్యం కాని హామీలను ప్రజలకు ఇచ్చి వివిధ పన్నుల పేరుతో ప్రజలపై భారం మోపితే సహించబోమని హెచ్చరించారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తానని ప్రగల్బాలు పలికిన చంద్రబాబు నేడు ఆ హామీని తుంగలో తొక్కి ప్రజలపై పెనుభారాన్ని మోపటమేమిటని ప్రశ్నించారు.




ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్ళు తెరిచి ప్రజలపై మోపిన విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించకపోతే ప్రజల పక్షంగా సిపిఐ పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోతుపాక వెంకటేశ్వర్లు, భోగ్యము నాగులు, మా శెట్టి రమేష్ బాబు, కరి సే మధు,షేక్ కరీం,రాణి తదితరులు పాల్గొన్నారు.

# తోట్లవల్లూరు మండలంలో సుపరిపాలనలో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా

**తోట్లవల్లూరు జూలై 5 మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా తోట్లవల్లూరు మండలం దేవరపల్లి, గుర్విందపల్లి గ్రామాలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయ్యేసరికే గ్రామాల్లో పలు మౌలిక వసతులను కల్పించడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇప్పటికే గ్రామాల్లో పలు సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. అలాగే రానున్న కాలంలో మిగిలిన రోడ్లను కూడా సిసి రోడ్లుగా అభివృద్ధి పరుస్తామన్నారు. ఇప్పటికే అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను అందించడంతోపాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం అందజేశామని, ఈ నెలలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభిస్తున్నామని, ఆగస్టు 15వ నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం గత ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు



పలువురు ప్రజల నుండి పెద్ద సంఖ్యలో మద్దతు లభించింది. ఎన్నికైన అనంతరం నిత్యం ప్రజల్లో మమేకమవుతూ ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారంలో ప్రత్యేకమైన శ్రద్ధ కనపరుస్తున్నారని వారు పేర్కొన్నారు. కాగా గెలిపించిన ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం లోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ మాసాంతంలో మహీంద్రా బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ ప్యాక్ టూ డెలివరీలు ప్రారంభం




**విజయవాడ మేజర్ న్యూస్ :** మహీంద్రా ఎలక్ట్రిక్ ఎస్యువిలు ఇప్పుడు భారతదేశంలో ఈవీ మార్కెట్ లీడర్‌లుగా మారాయి. కస్టమర్ల అపూర్వ విశ్వాసం, ఆసక్తి కారణంగా, దేశవ్యాప్తంగా ప్రతి 10 నిమిషాలకు ఒక మహీంద్రా ఎలక్ట్రిక్ ఎస్యువి అమ్ముడవుతోంది. ఈ అద్భుతమైన విజయ పరంపరను కొనసాగిస్తూ, మహీంద్రా ఈ నెల చివరి నుండి రూ. 21.90 లక్షల ఆకర్షణీయమైన ధరకు దాని అత్యంత విజయవంతమైన బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ ఈఎస్యువిల కోసం ప్యాక్ టూ డెలివరీలను ప్రారంభిస్తోంది. ప్యాక్ టూ ఇప్పుడు ఇప్పటికే ఉన్న 59 కిలోవాట్ వేరియంట్‌తో పాటు 79 కిలోవాట్ బ్యాటరీ అవకాశాన్ని కలిగి ఉంటుంది. ఇది వరుసగా 500 కిమీ, 400 కిమీ వాస్తవ రేంజ్ ను అందిస్తోంది.

## జంతువుల ద్వారా వచ్చే వ్యాధులపై అప్రమత్తం

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఆదివారం ప్రపంచ జునోసిస్ దినం సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ, పశుసంవర్ధక శాఖ, ఎన్టీఆర్ జిల్లా, జీవకారుణ్య సంస్థ, భవానీపురం, సాయి బాబా సత్సంగ సేవ సమితి, నవోదయ వేట్ సొసైటీ వారి సంయుక్త నిర్వహణలో నగరంలోని కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటరు, కె బి య న్ కాలేజ్ దగ్గర ఉదయం 7 గంటలనుండి మధ్యాహ్నం 12 గంటలవరకు, భవానీపురం ఐరన్ యార్డు లోని జీవకారుణ్యం ఆశ్రమం, ఐరన్ కాంప్లెక్స్ వద్ద ఉదయము 9 గంటలు నుండి మధ్యాహ్నం 12 గంట వరకు వీధి కుక్కలకు, పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులను జూనోసిస్ అంటారని, రేబీస్, బర్డ్ ఫ్లూ, నిపా, బ్రూసెల్లోసిస్, లీప్టోస్పైరాసిస్ వాటికి ఉదాహరణలని, ప్రాణాంతక వ్యాధులైన ర్యాబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ వ్యాధులు ప్రజలకు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ర్యాబిస్ వ్యాక్సిన్ మొట్ట మొదటిగా 1885లో జులై 6న లూయిస్ పాశ్చర్ సైంటిస్ట్ మనుషుల్లో తొమ్మిదేళ్ల బాలుడిపై ప్రయోగించి ఘన విజయం సాధించారన్నారు. ఆంత్రాక్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా



**కోడూరు మేజర్ న్యూస్:** కోడూరు మండలం పాదాల వారి పాలెం, పాలకాయతిప్ప గ్రామాలలో మంచినీటిని సరఫరా చేస్తున్న మన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ బుధవారం తీర గ్రామాల దాహం తీర్చేందుకు 20వేల మీటర్లు సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా కోడూరు మండలం పాదాల వారి పాలెం, పాలకాయతిప్ప, గ్రామాలకు తాగునీరు అందజేశారు..

## శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**పెదపారుపూడి జులై 5 మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు మూరల శ్రీనివాసరావు మరణించగా పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఈ నెల 10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కార్యక్రమాలు

ఈ ఏడాది జూనియర్ కళాశాలల్లో కూడా నిర్వహణ

తల్లిదండ్రులతో పాటు పూర్వ విద్యార్థులు హాజరు

తల్లి పేరుతో మొక్క నాటడం ఈ ఏడాది ప్రత్యేకం

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**ఎన్‌టీఆర్ జిల్లా, జులై 05, బ్యూరో, మేజర్ న్యూస్ :** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేలా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను ఈ నెల 10న జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని.. గత ఏడాది కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించడం జరిగిందని, ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో కూడా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌పై కలెక్టర్ లక్ష్మీశ శనివారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య హాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,500 పాఠశాలల నుండి రెండు లక్షల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి హాజరు కానున్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కూడా ఈ పీటీఎం సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 186 జూనియర్ కళాశాలల్లో 78,162 మంది విద్యార్థులున్నట్లు తెలిపారు. పిల్లలే ఆహ్వానాలను తల్లిదండ్రులకు అందిస్తారని, ఆహ్వానంతో పాటు ఒక ఫార్మాట్ ను కూడా ఇస్తారని, తల్లిదండ్రులు ఆ ఫార్మాట్ పై వారి అభిప్రాయాన్ని రాసి ఇస్తారని పేర్కొన్నారు. పండగలా నిర్వహించే ఈ కార్యక్రమాలలో పాఠశాల అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరుగుతుందని, టీచర్, స్టూడెంట్, పేరెంట్స్ తో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థి గతేడాది చూపిన ప్రతిభను, ఈ ఏడాది సాధించవలసిన దాని గురించి చర్చ జరుగుతుందన్నారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులను ఈ కార్యక్రమాలకు ఆహ్వానించడం జరుగుతుందని, అలాగే పూర్వ విద్యార్థులను, అక్కడే చదివి ఉన్నత స్థానాల్లో నిలిచిన గొప్ప వ్యక్తులను కూడా ఆహ్వానించి సత్కరించడం జరుగుతుందన్నారు. పిల్లలలోని సృజనాత్మకతను వెలికి తీసే విధంగా పలు పోటీలను నిర్వహించడం జరుగుతుందని, అలాగే తల్లిదండ్రులకు కూడా రంగోలి, టగ్ ఆఫ్ వార్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను కూడా అందజేయడం జరుగుతుందని తెలిపారు. తల్లి పేరుతో ఒక మొక్క నాటడం ఈ ఏడాది థీమ్ గా తీసుకోవడం జరిగిందని, పాఠశాల ఆవరణలో కానీ, లేదా వారి ఇంటి వద్దగానీ మొక్క నాట వచ్చని తెలిపారు.

అందుకోసం లీప్ యాప్ లో లాగిన్ అయి వారి పేరును నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమాల పర్యవేక్షణకు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కమిటీ లను నియమించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన పెంపొందించి, డ్రగ్స్ రహిత జిల్లా కోసం డ్రగ్స్ వద్దు బ్రో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి బి.ప్రభాకర్, సమగ్ర శిక్ష అధికారి జి.మహేశ్వరరావు పాల్గొన్నారు.




## తానా సభల్లో నేను - నా అమరావతి పుస్తక ఆవిష్కరణ

**నందిగామ, జులై 5, మేజర్ న్యూస్:** అమెరికాలోని తానా సభల్లో నందిగామ నియోజకవర్గానికి చెందిన బాలయ్య కోటయ్య రచించిన నేను రాసిన నేను – నా అమరావతి పుస్తకం ఆవిష్కరణ జరిగింది. ప్రజా రాజధాని అమరావతి నాకు ఇచ్చిన గొప్ప వరం అని, నా జీవన ప్రయాణంలో నేను రాజధాని ఉద్యమంలో పాల్గొంటానని కానీ, 1631 రోజుల పాటు రైతులతో కలిసి నడుస్తానని కానీ, రాజధాని ఉద్యమంపై పుస్తకం రాస్తాను అని కానీ, అలా రాసిన పుస్తకాన్ని అమెరికాలో ఆవిష్కరణ చేస్తానని కానీ ఏనాడూ ఊహించలేదని, ఈ పరిణామాలతో నా జన్మ ధన్యం అయిందని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య భావోద్వేగంతో ప్రసంగం చేశారు. శనివారం తానా సభల్లో తానా ప్రతినిధులు, పలువురు ప్రముఖుల ఆధ్వర్యంలో నేను నా అమరావతి పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా బాలకోటయ్య మాట్లాడుతూ దాదాపు 13 వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి మీ ముందుకు వచ్చానని చెప్పారు. చరిత్రను లిఖించాల్సి అవసరం ఉందని, లేకపోతే భావి తరాలకు చరిత్ర తెలియదని చెప్పారు. అమరావతి ఉద్యమం గూర్చి, భూములు ఇచ్చిన రైతులు చేసిన నాలుగైదు మాటల్లో చెప్పేది కాదని, ఇదొక అద్భుతం అని బాలకోటయ్య అభివర్ణించారు. పుస్తక ఆవిష్కరణ సభలో చికాగోకు చెందిన యలమంచి ప్రసాద్, కాలిఫోర్నియాకు చెందిన శ్యామ్ అరబింది, తానా మాజీ ఛైర్మన్ కోమటి జయరాం, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి బివి వెంకటేశ్వరరావు, అప్పసాని రాజేష్, మహాసేన రాజేష్, లక్ష్మి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## హలో మాదిగ చలో ఈదుముడిని జయప్రదం చేయండి



**నందిగామ, జులై 5, మేజర్ న్యూస్:** హలో మాదిగ చలో ఈదుముడి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విజయోత్సవాన్ని విజయవంతం చేద్దాం అని అనిఎమ్మార్పీఎస్ ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు దొండపాటి సుధాకర్ పిలుపునిచ్చారు. 7–7–1994న ప్రకాశం జిల్లా నాగులుప్పులపాడు మండలం ఈదుముడి గ్రామంలో ప్రారంభించబడిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం 31సంవత్సరాలు పూర్తిచేసుకొని 32వ వార్షికంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్సీ రిజర్వేషన్లు చట్టాలను ఆర్డినెన్స్ జీవోలు సాధించుకున్నాము ఇది వర్గీకరణ నామ సంవత్సరం కనుక ఈనేపథ్యంలోనే ఎమ్మార్పీఎస్ ప్రారంభించిన ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుముడి గ్రామంలోనే సోమవారం నాడు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జాతీయ స్థాయి విజయోత్సవం జరుగుతుంది ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మాదిగ, మాదిగ అనుబంధ సంఘాల ఉద్యమకారులు, ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు,ఎంఆర్పిఎస్ అనుభందం సంఘాల కార్యకర్తలు,అభిమానులు, పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరుతున్నాం, మాదిగ మాదిగ అనుబంధ సంఘాల సమగ్ర అభివృద్ధికి అధికారంలో వాటా సాధనకు మాదిగ ఉద్యమం రాజకీయ కక్ష్యలోకి ప్రవేశించాల్సిన అవసరం ఉంది ఈ అంశాలపై ఈ వర్గీకరణ విజయోత్సవంలో ప్రకటన కూడా వెలువడే అవకాశం ఉంది. మాదిగ మాదిగ అనుబంధ కులాలు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని ఈ విజయోత్సవ వేడుకల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఏపీఎస్ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ తలపెట్టిన గేటు ధర్నా రెండో రోజు కొనసాగింది.ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండు రోజులు నిర్వహించ తలపెట్టిన గేటు ధర్నా కార్యక్రమం రెండో రోజు శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు డి ఎల్ ప్రసాద్, కార్యదర్శి మహేష్, బి సురేష్, పి రంగారావు, కమలశ్రీ, వెంకటలక్ష్మి, ప్రసన్న కుమార్, గ్యారేజ్ కమిటీ, సిబ్బంది పాల్గొని సమస్యలు పరిష్కారం కోరుతూ ధర్నా నిర్వహించారు.



## సీపీఐ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన

**నందిగామ, జులై 5, మేజర్ న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఆంధ్ర ప్రదేశ్ అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సెకి ఒప్పందాలను రద్దు చేసి, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, పేదలకు పెనుభారంగా మారిన ట్రూ అప్ చార్జీలను,సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, ఫేస్ వన్, ఫేస్ టు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు.అనంతరం స్థానిక విద్యుత్ అధికారి కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నందిగామ నియోజకవర్గ కార్యదర్శి చుండూరి సుబ్బారావు సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి తో పాటు పలువురు సిపిఐ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడి కార్యదర్శిగా సోమేశ్వరరావు బాధ్యతలు



**మొవ్వ (జూలై 5) మేజర్ న్యూస్:** కూచిపూడి గ్రామపంచాయతీ కార్యదర్శిగా కె.వి సోమేశ్వరరావు శనివారం (పూర్తి అదనపు బాధ్యతలు) బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రమైన మొవ్వ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.వి సోమేశ్వరరావును కూచిపూడి గ్రామపంచాయతీ గ్రేడ్–1 కార్యదర్శి (పూర్తి అదనపు బాధ్యతలు)గా ఎంపీడీఓ డి. సుహాసిని ఉత్తర్వులు జారీ చేయడం పాఠకులకు విదితమే. ఈ మేరకు సోమేశ్వరరావు బాధ్యతలు స్వీకరించడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది స్వాగతం పలికి అభినందించారు.



## జాతీయస్థాయి సదస్సులో మున్సిపల్ ఛైర్మన్ మండవ



**నందిగామ, జులై 5, మేజర్ న్యూస్:** గురు గ్రామ్, హర్యానా : కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో "రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర" అంశంపై సదస్సుకు రాష్ట్రం నుంచి హాజరైన నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి హాజరయ్యారు. ఈ సదస్సు జూలై 3, 4 తేదీల్లో హర్యానాలోని, గురుగ్రామ్ లో భారత పార్లమెంటు హర్యానా ప్రభుత్వ సహకారంతో.. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పట్టణ స్థానిక సంస్థల చైర్మన్ లకు ఈ సదస్సు పై అవగాహన కల్పించడం కోసం రెండు రోజులు జాతీయ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు ఏపీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లను నామినేట్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకు మారికు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ తెలుగువారి కీర్తి ప్రతిష్టలకు సూచిక హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అయన్ని కలవడం నిజంగా చాలా ఆనందదాయకంగా ఉంది. అలాగే కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం అనే నినాదంతో ముందుకు వెళుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో నందిగామ పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని తెలిపారు.

## ఐఏఎస్‌గా 10సం.ల పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా కలెక్టర్‌నీ సత్కరించిన జిల్లా అధికారులు






**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఐఏఎస్ గా ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ నిన్నటి రోజు శుక్రవారానికి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ ఆనంద్ కుమార్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ ఐఏఎస్ గా పదవీ బాధ్యతలు చేపట్టిననాటి నుండి ఇప్పటివరకు పేద ప్రజల పట్ల చూపుతున్న దయాగుణం, వారికి సహాయం చేయాలన్న తపన, మానవత్వం, ఏ అంశంలో అయినా ఉద్యోగులు సులభంగా ఎలా విధులు నిర్వహించాలో విశదీకరణ, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని విద్యార్థులకు ఇచ్చే ప్రేరణ, ఉపాధ్యాయులకే ఉపాధ్యాయులుగా శిక్షణ ఇచ్చిన తీరును ప్రస్తావిస్తూ జిల్లా కలెక్టర్ ను అభినందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఐఏఎస్ గా చేసిన ప్రజా సేవల పై రూపొందించిన ఏ.వి.ప్రదర్శించారు. అధికారులు పెద్ద ఎత్తున గజ పూలమాల, పూల కిరీటం శాలువలు, పుష్పగుచ్చాలు, జ్ఞాపికలతో జిల్లా కలెక్టర్ ను ఘనంగా సత్కరించారు. అందరూ జిల్లా కలెక్టర్ చేత కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ డాక్టర్ జే అరుణ, డి ఆర్ డి ఏ పిడి హరిహరనాథ్, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు, డీఎంహెచ్వో డాక్టర్ శర్మిష్ఠ, డిఐసి జిఎం ఆర్ వెంకటరావు, పౌరసరఫరాల సంస్థ డీఎం శివరాం ప్రసాద్, ఉపాధి కల్పనాధికారి విక్టర్ బాబు, పలువురు ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## "నందిగామలో ఉచిత అంబులెన్స్ సర్వీసు ప్రారంభం"



**నందిగామ, జులై 5, మేజర్ న్యూస్:** పట్టణ పరిధిలో గల ఆర్యవైశ్య కుటుంబాల్లో ఉన్న వారికి, ఆరోగ్యరీత్యా అత్యవసర ప్రాణాపాయ పరిస్థితి కలిగినప్పుడు సుదూర ప్రాంతాలకు రవాణా కొరకై "ఉచిత అంబులెన్స్ సర్వీసు" ఏర్పాటు చేయటం సంతోషదాయకం అని నందిగామ సర్కిల్ ఇన్ స్పెక్టర్ వై.వి.యల్. నాయుడు అన్నారు. నందిగామ రైతుపేట వాస్తవ్యులు కపిలవాయి మల్లికార్జునరావు - ధనలక్ష్మీ కుమారుడు యూకే లో ఉంటున్న కపిలవాయి గంగాధర్ (గంగ) మాతృభూమి మీద ఉన్న మమకారంతో, తన సొంత నిధుల నుంచి 4 లక్షల రూపాయలు వెచ్చించి, గంగాధర్ స్నేహితులు మాధవ్ కుమార్ బోయపాటి లత వారి వివాహ వార్షికోత్సవ సందర్భంగా దంపతులను అభినందిస్తూ నందిగామ ఆర్యవైశ్య సంఘానికి సంఘ ప్రముఖుడు పారేపల్లి సాయిబాబుకు ఉచితంగా అంబులెన్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ ప్రధాన ఆర్గనైజర్ పారేపల్లి సాయిబాబు మాట్లాడుతూ నందిగామ పట్టణ పరిధిలో కల ఆర్యవైశ్యులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నామమాత్రపు రుసుముతో ఆక్సిజన్ సిలిండర్ తో కూడిన ఏసి అంబులెన్స్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని అయితే కావలసినవారు 98 490 48 238 నెంబర్ కు కాల్ చేయాలని అన్నారు. గాంధీ సెంటర్లో శనివారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమానికి అనేకమంది ఆర్యవైశ్య, వైశ్యతర ప్రముఖులు హాజరై కార్యక్రమంలో పాలుపంచుకున్నారు అంబులెన్స్ ను ఉచితంగా వితరణ చేసిన డోనర్స్ ను సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ వై.వి. యల్ నాయుడు ఇతర ప్రముఖులు అభినందించి శాలువాతో సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం తరపున సి.ఐ ని శాలువాతో సత్కరించారుగాంధీ సెంటర్లో అట్టహాసంగా జరిగిన ఈ ప్రారంభోత్సవ సందర్భంగా బాణాసంచా కాల్చి,విచ్చేసిన వారందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబులెన్స్ ప్రధాన ఆర్గనైజర్ పారేపల్లి సాయిబాబు, ప్రభుత్వ హస్పటల్ కమిటీ చైర్మన్ఏపూరి నాగేశ్వరరావు, షేక్ ఖాలిక్,మారంఅమరయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్- తెలుగుదేశం మహంకాళి కోటేశ్వరరావు(కోటి) అంబులెన్స్ కో - కన్వీనర్ కందుకూరి మహేష్ కుమార్, అన్నపూర్ణ సేవాసమితి కమిటీ, ఆర్యవైశ్య సంఘం కమిటీ, రిటైర్డ్ ఎస్సై యరగొర్ల రామారావు, బలుసుపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు రైతు జీవితంలో వెలుగు కావాలి







### గురువిందపల్లి గ్రామంలో వరి చేలకు దమ్ము చేసి, పూజా కార్యక్రమాలతో వరి నాట్లు వేసిన ఎమ్మెల్యే కుమార్ రాజా.

### హర్షం వ్యక్తం చేసిన రైతులు...

**తోట్లవల్లూరు జూన్ 5 మేజర్ న్యూస్ :** సుపరిపాలనలో తొలి అడుగు రైతు జీవితంలో వెలుగు కావాలని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండలం గురువిందపల్లి గ్రామంలో పల్లెనిద్ర చేసిన ఆయన శనివారం ఉదయం రైతులు, వ్యవసాయ కూలీలతో కలిసి గ్రామంలోని పొలాలలో వ్యవసాయ పనులను ప్రారంభించారు. ముందుగా పొలంలో ట్రాక్టర్ తో దమ్ము చేసి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వ్యవసాయ కూలీలతో కలిసి ఎమ్మెల్యే కుమార్ రాజా నాట్లు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులతో మాట్లాడుతూ జలకళతో నదులు, కాలువలు పొంగిపొర్లుతున్నాయని అదే విధంగా రైతులు పచ్చని పైరు పంటలతో కళకళలాడాలని కోరుకుంటున్నానన్నారు. తమకూటమి ప్రభుత్వం కూడా అందరూ సంతోషంగా, సుభిక్షంగా ఉండాలని కోరుకుంటోందన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు నీరు ఇవ్వటానికే బాధపడ్డారని, కనీసం పంట కాలువలు, మురుగు బోదులు కూడా బాగు చేయలేదని, డ్యాముల్లో నీళ్లు నిలువ పెట్టే ప్రయత్నం కూడా చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. గతంలో ఆగస్టు నెలలో రైతులు వరి నాట్లు వేసే వారని, దానివల్ల ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బందులు పడే వారని, అటువంటిది ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రైతులకు జూలై నెలలోనే వరి నాట్లు వేసుకునే విధంగా కాలువలకు నీరు అందించామన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు కూడా అందుబాటులోకి తీసుకొస్తామని, రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే కుమార్ రాజా కోరారు. ఈ సందర్భంగా పలువురు వ్యవసాయ కూలీ మహిళలు ఎమ్మెల్యే కుమార్ రాజాకు బొట్టుపెట్టి, ఆశీర్వదించి తమకు సోదరుని మాదిరిగా ఎమ్మెల్యే అండగా ఉంటున్నారని ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## వేల్పూరులో విద్యార్థులకు పుస్తకాల బహుకరణ



**పమిడిముక్కల జులై 5 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వేల్పూరు గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రామ మాజీ సర్పంచ్ తిరుమలశెట్టి బోసుబాబు సౌజన్యంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బాక్సులను పంపిణీ చేశారు. గత 25 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం విద్యార్థులకు వీటిని అందజేస్తున్న దాత బోసుబాబును ఈ సందర్భంగా పలువురు అభినందించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ బాబు, మండల పరిషత్ వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ మండల విద్యాశాఖ అధికారిని ఐపద్మ రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నానిబాబు, పలువురు గ్రామస్తులు, తల్లిదండ్రులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం



**ఘంటసాల, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని, తెదేపా జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ అభివృద్ధికి తొలి అడుగు, ఇంటింటికి తెదేపా కార్యక్రమం ఘంటసాల గ్రామంలోని నందం బజార్లో శనివారం ప్రారంభించారు. అలాగే ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తెలుపుతూ కరపత్రాలు అందజేశారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం పథకం, తల్లికి వందనం వంటి పథకాలను, ఏడాదిలోనే ప్రారంభించి, ప్రజలందరికీ లబ్ది చేకూర్చుమన్నారు. తెదేపా అధికారం చేపట్టిన వెంటనే పింఛన్ రూ 4,000/-లు పింఛన్ దారులకు అందించిన దార్శినికుడు సీఎం నారా చంద్రబాబు నాయుడిదే అన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమం మాత్రమే అమలు చేశారని, ఈ ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు, అభివృద్ధి కూడా సమపాళ్లలో చేయటం చంద్రబాబు నాయుడు చాణిక్యనీతికి నిదర్శనం అన్నారు. ఘంటసాల మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, మార్కెట్ కమిటి చైర్మెన్ కొల్లూరి వెంకటేశ్వర రావు, శ్రీకాకుళం డిసి చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న), పరిసే చలపతిరావు, మేడికొండ విజయ్, కొడాలి లక్ష్మణ్, గొర్రెపాటి సురేష్, ఆకుల ధర్మ వెంకట నరసయ్య, యార్లగడ్డ వీరభద్రరావు, మొవ్వ బాచి, గ్రామ ప్రముఖులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బాలికొన్నత పాఠశాలలో స్వచ్ఛభారత్ చేపట్టిన హెచ్ఎం నక్కా.బాబురావు



**మునుగంచిప్రోలు జులై 5 మేజర్ న్యూస్ :** శ్రీ స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నాడు ఆటస్థలం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు నక్క బాబురావు. గతంలో ఆటస్థలం పిల్లల ఆటపాటలకు అనుకూలంగా లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు నక్కా బాబురావు సొంత డబ్బులను వెచ్చించి దగ్గర ఉండి పనులు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు వేగినేటి వెంకటరమణ సలహాలు, సూచనలతో పాఠశాల ఆటస్థలమును తీర్చిదిద్దుతున్నట్లు హెచ్.ఎం నక్కా బాబురావు తెలిపారు. పదవ తేదీన జరగబోతున్న తల్లిదండ్రులు సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు, సమాజ సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

## ఆర్‌టీఐహెచ్‌లో సీఏ, సీఎస్ ఖాళీలు

### జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** ఎనికేపాడులోని రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసేందుకు చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ), కంపెనీ సెక్రటరీ (సీఎస్)గా పనిచేసేందుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5.30 గంటల్లోగా కొటేషన్లను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని.. పోస్టు ద్వారాగానీ లేదా నేరుగాగానీ కార్యాలయ పనివేళల్లో కలెక్టర్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో సమర్పించవచ్చన్నారు. కాంట్రాక్టు పీరియడ్ ప్రథమికంగా ఏడాది ఉంటుందని.. ఈ కాలాన్ని పొడిగించే అవకాశముందన్నారు. అభ్యర్థి అర్హతలు, కనీసం మూడేళ్ల అనుభవం, అకౌంటింగ్ సిస్టమ్స్, టూల్స్ ప్రొఫిషయన్సీ, రెగ్యులేటరీ ఫైలింగ్, గవర్నెన్స్ పాలసీలు, స్టాట్యుటరీ డాక్యుమెంటేషన్ తదితర అంశాలపై పరిజ్ఞానం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని జేసీ ఇలక్కియ తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గ్రామ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అన్నారు. శనివారం కానూరు గ్రామపంచాయతీలో సామాజిక గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సభలో 'గోపు' మాట్లాడుతూ అంగన్వాడీ ప్రహరీగోడల నిర్మాణం, జరగవలసిన ఉపాధి హామీ పనుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సరఫరా వాడుక, నీటి సరఫరా నాణ్యత ఎలా ఉందని ప్రజలను అడిగారు. వర్షాకాలం అంటువ్యాధులు వ్యాపించకుండా ప్రజలు కాచి చల్లార్చిన మంచి నీరు త్రాగడం, పరిసరాల పరిశుభ్రత పాటించడం చేయాలన్నారు. శరీరం లో అనారోగ్యం వస్తే వెంటనే ఊళ్లో ఉన్న ఏఎన్ఎం,ఆశా వర్కర్లను సంప్రదించాలని తెలియజేసారు. ఏఎన్ఎం,ఆశా వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని, అవసరమైన మందులు నిల్వ చేసు కోవాలని ఆదేశించారు. పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర రావు,జనసేన ఇంచార్జి మహేష్, బొమ్మిడి పెద ఏడుకొండలు,పీతా రాము, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి పవిత్రోత్సవాలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రాచీన వైష్ణవ ఆలయం గా పేరుందిన శ్రీ భూనీళా రాజ్య లక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు శుక్రవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్తలు పోతరాజు భాస్కరరావు ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వాగతం పలికారు. ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలకు ఎమ్మెల్యే దంపతులు విచ్చేయగా అర్చక స్వాములు బృందావనం వేణుగోపాలచార్యులు, దీవి అప్పలాచార్యులు, దీవి వేణుగోపాలాచార్యులు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు జరిపించగా, ఈఓ యార్లగడ్డ శ్రీనివాసు వారిని ఘనంగా సత్కరించారు.

## ఆక్రమించిన దుకాణాలను తొలగించాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ ప్రధాన రహదారితో పాటు పులిగడ్డ నుండి లక్ష్మీ టాకీస్ వరకు ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణ చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించి రోడ్డు ప్రమాదాలతో పాటు ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని బిజెపి నేతలు శనివారం మండల పరిషత్,మండల రెవెన్యూ, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణలు చేసి అనేక తినుబండార షాపులు మాంసం దుకాణాలు పండ్లు టీ షాప్‌లు బండ్లు సైతం ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటూ వీటికి సంబంధించిన వ్యర్థాలను పంట కాలంలో పారేయముతో దిగున ఉన్న ప్రజలు ఈ నీటినే తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు అని పేర్కొన్నారు ఇటువంటి ఆక్రమణలను వెంటనే తొలగించి దివి ప్రజానీకాన్ని రోగ విముక్తులను చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు తుంగల వెంకటగిరి, భోగాది చంద్రశేఖర్, జీవీ నగరాయులు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# పామర్రులో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కుమార్ రాజా భూమి పూజ



**పామర్రు జులై 5 మేజర్ న్యూస్:** పేదలకు పట్టెడు అన్నం పెట్టాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించామని స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రులో 61 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అన్నా క్యాంటీన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు ఎంతో సంతోషకరమైన రోజు అని, పామర్రు ప్రజలు దీర్ఘకాలంగా చూస్తున్న ఎదురుచూపులు ఫలించాయన్నారు. ఎన్నో నెలల కృషి ఫలించి, ఈరోజు పామర్రు లో అన్నా క్యాంటీన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామన్నారు. ఎవరు కూడా ఆకలితో ఉండకూడదనే మంచి ఆశయంతో సీఎం చంద్రబాబు అన్నా క్యాంటీన్ వ్యవస్థను ప్రారంభించారని పేర్కొన్నారు. ఐదు రూపాయలకు భోజనం ఎలా పెడతారంటూ దుర్మార్గ వైకాపా ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను మూసేసిందని, నేడు రాష్ట్రవ్యాప్తంగా దిగ్విజయంగా అన్నా క్యాంటీన్ల ద్వారా లక్షలాదిమందికి భోజనం అందిస్తున్నామన్నారు. నిత్యం వెయ్యి మందికి ఆహారం అందించేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారంలో ప్రజల వద్దకు వెళుతుంటే, వారు చూపిస్తున్న ఆదరణ ఎంతో సంతోషం కలిగిస్తోందన్నారు. గత వైకాపా పాలన సమయంలో దాత ముందుకు వచ్చి స్థలం కేటాయించగా అందులో దాతల సహకారంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయగా అప్పటి ప్రభుత్వంలో ఉన్నవారు క్యాంటీన్ ను మూసి వేయించే వరకు నిద్ర పోలేదని, స్థలం ఇచ్చిన దాతను కూడా బెదిరింపులకు గురి చేశారని ఆయన విమర్శించారు. అయినప్పటికీ ప్రజల అండదండలతో అధికారంలోనికి వచ్చిన తమ ప్రభుత్వం తిరిగి అన్న క్యాంటీన్ పునరుద్ధరించడం జరుగుతోందన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని అటువంటి అన్నం పేదలకు దొరకకుండా చేసిన వైకాపాకు ప్రజలు పెద్ద ఎత్తున బుద్ధి చెప్పారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అతి తక్కువ ధరలో ఐదు రూపాయలకే భోజనం అందిస్తుంటే అది చూసి ఓర్వలేక వైకాపా నాయకులు కుట్ర, కుతంత్రాలతో అన్నా క్యాంటీన్లను మూసి వేయించారని, అదే వారికి గత ఎన్నికల్లో శాపంగా పరిణమించిందని ఎమ్మెల్యే కుమార్ రాజా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు, మొవ్వ, పమిడిముక్కల మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, లింగమనేని రామలింగేశ్వర రావు, రాజులపాటి శ్రీనివాస రావు, పార్టీ సీనియర్ నాయకులు గొట్టిపాటి లక్ష్మీ దాసు, జక్కా శ్రీనివాసరావు, లాజరస్, ఆరుమళ్ళ అనిత రెడ్డి, మండపాక శంకరబాబు, చాట్ల రమేష్, మైనేని నరేంద్ర, నియోజకవర్గం పరిధిలోని తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, పామర్రు నియోజకవర్గ అధ్యక్షుడు గుంప గంగాధర రావు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక తహసిల్దార్ జి.రవికాంత్, ఆర్ ఐ ఎ.రాము, ప్రజా ఆరోగ్య శాఖ డిఇఇ పి.ఆర్.సి. ప్రవీణ్, పామర్రు సీఐ వి.శుభాకర్, ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య శాఖ డిఇఇ ప్రవీణ్ ఎమ్మెల్యేకు అన్న క్యాంటీన్ భవన నిర్మాణ నమూనాను చూపించి, వివరాలను ఆయనకు అందించారు.

# జిల్లాలో వచ్చే ఆగస్టు 15వ తేదీ లోగా పి -4 కార్యక్రమం పూర్తి చేయాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో వచ్చే ఆగస్టు 15వ తేదీ లోగా పి -4 కార్యక్రమం కింద మార్గదర్శిలతో బంగారు కుటుంబాల అనుసంధానం చేసే ప్రక్రియ పూర్తి చేసేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం మందిరంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి పి 4, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాలపై జిల్లా అధికారులు, వివిధ వర్గాల సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పి 4, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. జిల్లాలో 67 వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన ధనికులను గుర్తించి మార్గదర్శిలను ఎంపిక చేయాలన్నారు. వారిని బంగారు కుటుంబాలతో ఆన్లైన్లో అనుసంధానం చేసి దత్తత తీసుకునేలా చొరవ చూపాలన్నారు. బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారిలో ఎవరికైనా ఆర్థిక సహాయం చేయడం, ఏదో రకమైన చేయూత అందించడం, పిల్లలకు చదువుకు అయ్యే ఖర్చు భరించడంగాని, జీవనోపాదులు కల్పించడం గాని లేదా ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవడం గాని లేదా వాళ్లకు అవసరమైన ఏదేని అంశంలో సలహాలు ఇచ్చి సరైన మార్గ నిర్దేశం చేయడం గాని చేయవచ్చన్నారు. జిల్లా అధికారులందరూ మొదట ఈ పి 4 కార్యక్రమం పై నమ్మకం ఉంచి ఆదివారం నుండే పని ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుండి మొదలుపెట్టాలని ముఖ్యంగా ప్రతి గ్రామ, వార్డు సచివాలయాన్ని ఒక యూనిట్ గా తీసుకొని అందులోని సిబ్బంది అందరూ చురుకుగా గ్రామాల్లో తిరిగి ముఖ్యంగా అక్కడి పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్న పూర్వ విద్యార్థులను మార్గదర్శిలుగా గుర్తించాలన్నారు. రైస్ మిల్లర్,డాక్టర్లు, ఆసుపత్రులు, ఇమిటేషన్ జ్యువలరీ సంఘాలు, రోటరీ, లైన్స్ క్లబ్ వారి పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు గాని వారి చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో పేద ప్రజలకు గాని ఏదైనా సహాయం చేసేందుకు ముందుకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఆయా సంఘాల సభ్యుల జాబితాను నియోజకవర్గాలు, మండలాల ప్రత్యేక అధికారులు తీసుకొని వారితో మాట్లాడి మార్గదర్శిలుగా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. కనీసం నియోజకవర్గానికి 5,000 మంది చొప్పున బంగారు కుటుంబాలను కార్యదర్శిలతో అనుసంధానం చేయాలన్నారు. అలాగే గుడ్లవల్లేరు, వాసవి, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలల్లో పూర్వ విద్యార్థుల జాబితా తీసుకొని వారిలో మంచి స్థితి మంతులుగా ఉన్న వారితో బంగారు కుటుంబాలను అనుసంధానం చేయాలని ముఖ్యంగా అదే కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు దత్తత తీసుకునేలా చొరవ చూపాలన్నారు. అంతేకాకుండా చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో పేద విద్యార్థులను కూడా చదివించేందుకు వారు అంగీకరించేలా కృషి చేయాలన్నారు. అలాగే పెట్రోల్ బంకు, ఆక్వా, కలంకారి వ్యాపారస్తులు, సూర్యఘర్ కంపెనీలు, పారిశ్రామికవేత్తలను కూడా సంప్రదించి మార్గదర్శిలుగా ఉండేందుకు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా, డి ఆర్ డి ఏ, మెప్మా, ఐ సి డి ఎస్ పిడీలు శివ ప్రసాద్, హరిహరనాథ్, సాయిబాబు,ఎం ఎన్ రాణి, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరాం ప్రసాద్,డి ఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, ఉద్యాన అధికారి జ్యోతి, సిపిఓ భీమరాజు, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, మార్ఫెడ్ డి ఎం మురలీకృష్ణ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలి

### నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రతిభ గల విద్యార్థులను స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదుకోవాలని మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రాజుపేట ఉర్దూ పాఠశాల, అంబారి అగ్రహారం స్పెషల్ ఎలిమెంటరీ పాఠశాల, భాస్కరపురం ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు,కేకులు అందజేశారు. మచిలీపట్నం మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జి కిషోర్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి హసింబేగ్, సంస్థ కో చైర్మన్, కార్పొరేటర్ చిత్తజల్లు నాగ రాము, సంస్థ కన్వీనర్ ముదిగొండ శాస్త్రి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ డైరెక్టర్ అజీమ్, మాగంటి శిరీష, సంస్థ జాయింట్ సెక్రెటరీ పివి ఫణి కుమార్, కే రాఘవేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిల్ విద్యార్థులకు స్వీట్లు



పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామని అన్నారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు.

# క్షయ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం



**గన్నవరం, జూలై 5, మేజర్ న్యూస్ :** జాతీయ క్షయ వ్యాధి నివారణ శత దినోత్సవము లో భాగంగా శనివారం గన్నవరం సబ్ జైల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముస్తాబాద్ వైద్యాధికారి డాక్టర్ హర్ష గన్నవరం సబ్ జైల్లో ముద్దాయిలుగా ఉన్న ఖైదీలకు క్షయ వ్యాధి, ఇతర మత్తు పదార్థముల వల్లగలిగే నష్టాలు గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్ష మాట్లాడుతూ.. క్షయ వ్యాధి రెండు లేక మూడు వారములు పొడి దగ్గు, శరీర బరువు కోల్పోవడం, గొంతు నుండి కఫం రావటం, మెడ చుట్టూ దద్దుర్లు, జ్వరముతో కూడిన నీరసము ఇవి క్షయ వ్యాధి లక్షణములు. క్షయ వ్యాధి మనిషి వెంట్రుకలు, గోళ్ళకు తప్ప శరీరంలో ఏ భాగంలోనైనా క్షయ వ్యాధి రావచ్చని చెప్పారు. క్షయ వ్యాధి కఫము ద్వారా పరీక్ష నిర్వహించి ఆరు నెలల పాటు మందులు వాడినట్లయితే పూర్తిగా నయమవుతుందని డాక్టర్ హర్ష తెలిపారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం తరఫున ప్రతినెల ఒక వెయ్యి రూపాయలు ఆరు నెలల పాటు అందజేయడం జరుగుతుందని ఈ మొత్తము వ్యాధి గ్రస్తుడు బలమైన ఆహారం తీసుకొనుట కొరకు ఉపయోగించుకోవాలని, అలాగే మత్తుపదార్థములకు దూరంగా ఉండాలని, మద్యపానం, ధూమపానం వీటికి దూరంగా ఉండాలని చెప్పారు. ముద్దాయిలకు మీ బంగారు భవిష్యత్తు పాడు చేసుకోవద్దని జైలు నుండి బయటకు వెళ్లిన తరువాత డ్రగ్స్ కు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మత్తులో ఏమి చేస్తున్నామో ఉనికిని కోల్పోతామని దానివల్ల కుటుంబాలు రోడ్డున పడతాయని మీ బంగారు భవిష్యత్తు పాడవుతుందని మీపై ఆధారపడ్డ వాళ్ల గురించి ఆలోచించుకోవాలని డాక్టర్ హర్ష తెలిపి ఉన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు అధికారి రాంబాబు, వైద్య సిబ్బంది సాంబశివరావు, శ్రీనివాసరావు, సీతారామయ్య, రఘు, సబ్ జైల్లోని విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొని ఉన్నారు.



## జూలై 9 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జూలై 05 :** జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని చెప్పి గుడ్లవల్లేరు మండలంలో జనరల్ బాడీ చందన లక్ష్మీ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చాలని ప్రయత్నం చేస్తుంది. ఈ లేబర్ కోడ్ లు కనుక అమలు అయితే భారతదేశంలో ఉన్న కార్మికులందరికీ తీవ్రమైన నష్టం జరుగుతుంది. కనీసం రోడ్డు మీదకు వచ్చి అడిగే హక్కు లేకుండా చేసి పెట్టుబడిదారులకి అనుకూలమైన కోడ్ లను తీసుకురావాలని ప్రయత్నం చేస్తుంది. 44 కార్మిక చట్టాల్ని నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని పిలుపునిచ్చారు. సిఐటియు ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి మాట్లాడుతూ స్కీం వర్కర్లకి కనీస వేతనం 26000 ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్స్ సౌకర్యాలు కల్పించాలని, పంచాయతీ కార్మికులకు సంబంధించి టెండర్ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలని, తదితర డిమాండ్ల సాధన కోసం జూలై 9 వ తారీఖున జరిగే దేశవ్యాప్త సమ్మెలో గుడ్లవల్లేరు మండలంలోని కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అమ్మాజీ, జయలక్ష్మి, విజయలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, ఆశా కార్యకర్తల నుండి ఇందిరా, మధ్యాహ్న భోజన పథకం నాయకురాలు రమాదేవి, పంచాయతీ నాయకురాలు మౌనిక, జగన్ తదితరులు పాల్గొన్నారు

## బీఎల్వోలకు 5 నుండి 16 వరకు శిక్షణ తరగతులు




**గన్నవరం, జూలై 5, మేజర్ న్యూస్ :** ఎన్నికల నియమ నిబంధనలపై బీఎల్వోలు అవగాహన కల్గి ఉండాలని గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి టి. శివరామ ప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎన్నికల విధి విధానాలపై నియోజకవర్గ స్థాయి మాస్టర్స్ ట్రైనర్స్‌తో పాటు బీఎల్వోలకు ఈ నెల 5 నుండి 16 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో బీఎల్ వోల పాత్ర కీలకమైందని చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలోని 307 మంది బీఎల్ వోలకు మొదటి ఫేజ్ కింద శనివారం జరిగిన ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో 43 మంది బీఎల్ వోలు హాజరు అయినారు. ఈ నెల 9 నుంచి ఓటర్ జాబితా తయారీ, మార్పులు, చేర్పులు అదే విధంగా మర ణించిన వారు, వలస వెళ్లిన వారి ఓట్లను పరిశీలించి తుది సమాచారం అందించే విధంగా శిక్షణ తర గుతులను చేపట్టామని పేర్కొన్నారు. చేపట్టే కార్య క్రమాలపై వివిధ పార్టీల ప్రతినిధులకు సమాచారం అందించాలని, ఎలక్ట్రోల్ అధికారి టి. శివరామ ప్రసాద్ సూచించారు. 80 ఏళ్లు దాటిన ఓటర్ల వివరాలను తప్పక సేకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కట్ట. వెంకట శివయ్య, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ నాంచారమ్మ, ఉంగుటూరు డిప్యూటీ తాసిల్దార్ చిట్టి బాబు, మాస్టర్ ట్రైనింగ్ నవీన్, ఆనందరావు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నివారణ పై అవగాహన కార్యక్రమం

**ఘంటసాల, మేజర్ న్యూస్:** రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలంటే, అధికారులు, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ఘంటసాల ఏ. ఎం. సి. చైర్మన్ తోట కనకదుర్గ పేర్కొన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో డి. సుబ్బారావు ఆధ్వర్యంలో, మండలాధ్యక్షురాలు వేమూరి రజిని కుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.




చిన్న కళ్ళేపల్లి సర్పంచ్ గుత్తికొండ రామారావు (రాము) మాట్లాడుతూ తాడి చెట్లు పొలాలకు ఒక వరమని, ఆ తాడిచెట్ల సంరక్షణ ఎన్ఆర్ఈజీఎస్ కలిపి పొలాల చుట్టూ ఉన్న తాడి చెట్లను ఆకుల నరికి వాటిని శుభ్రం చేసే బాధ్యత ఎన్ఆర్ఈజీఎస్ తీసుకోవాలని అధ్యక్షులకు తెలిపారు. ఎంఈఓ 2 మోమిన్ మాట్లాడుతూ ఈ మండలంలో విద్యా వ్యవస్థను మూడు క్లస్టర్లుగా విభజించారని, ఘంటసాల క్లస్టర్, శ్రీకాకుళం క్లస్టర్, లంకపల్లి క్లస్టర్లుగా... విభజించారని వాటితో పాటు మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం ఏర్పాటు సిద్ధం చేస్తున్నట్లు, తద్వారా విద్యార్థులకు మంచి పోషకాహారం అందుతుందని ఆనందం వ్యక్తం చేశారు. జడ్పిటిసి తుమ్మల మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంపీటీసీలకు 2 సం"ల నుంచి జీతభత్యాలు రావడం లేదని, వాటిని ఇప్పించి ఆదుకోవాలని మండల అధ్యక్షురాలిని కోరారు. స్పందించిన మండల అధ్యక్షురాలు వేమూరి రజిని కుమారి త్వరితగతిన వారికి జీతాలు అందించే ఏర్పాటు చేస్తామని అందరూ కలుపుగోలుగా పనిచేస్తూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు.

## మచిలీపట్నంలో అత్యంత వైభవంగా రథయాత్ర



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నంలో అత్యంత వైభవంగా రథయాత్ర నిర్వహించారు. రథయాత్రలో స్వామి వారికి మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని, భక్తులతో కలిసి ప్రత్యేక పాల్గొన్నారు. మంత్రి స్వయంగా స్వామి వారి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రథయాత్రలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద రథయాత్ర పూరీలోని జగన్నాథ స్వామి రథయాత్ర అటువంటి రథయాత్రలో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు. నేను కూడా పూరీ జగన్నాథ స్వామి రథయాత్రలో పాల్గొని స్వామి వారి కరుణా కటాక్షాలు పొందాను. పూరీ యాత్ర మాదిరి మచిలీపట్నంలో కూడా జగన్నాథ స్వామి యాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. గత మూడేళ్లుగా రథయాత్ర నిర్వహిస్తున్న నిర్వాహకులు పల్లపాటి సుబ్రహ్మణ్యంను మంత్రి కొల్లు రవీంద్ర అభినందించారు.

## కెయూలో స్మార్ట్ క్లాస్ రూమ్స్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం అవసరమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ పేర్కొన్నారు. హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూమ్స్ ను హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ ఆంధ్ర ప్రదేశ్ రీజినల్ హెడ్ పవన్ కుమార్‌తో కలిసి శనివారం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ టీవీ ఏర్పాటు చేయడం ద్వారా తరగతి గదులు మరింత స్మార్ట్ గా మారడం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ ఆంధ్ర ప్రదేశ్ రీజినల్ హెడ్ సి హెచ్ పవన్ కుమార్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమం లో భాగంగా మూడు లక్షల ఇరవై ఐదు వేల రూపాయలు వ్యయం తో మూడు స్మార్ట్ టీవీ లను విశ్వవిద్యాలయం కు బహూకరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, కంప్యూటర్ సైన్స్ డీన్ ఆచార్య వైకె సుందర కృష్ణ, సహాయ ఆచార్యులు డా కిరణ్ కుమార్, డా శ్రావణి, హెచ్ డి ఎఫ్ సి జోనల్ హెడ్ మహేష్ నాయుడు, క్లస్టర్ హెడ్ పి నరేష్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిషాసుర మర్దిని అమ్మవారికి లక్ష గాజుల సమర్పణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** శ్రావణమాసంలో గాంధీ బొమ్మ శివాలయంలో వేంచేసి ఉన్న శ్రీ మహిషాసురమర్ధని అమ్మవారికి జరిగే లక్ష గాజుల అలంకారమునకు శనివారం మన మహిషాసుర మర్దిని అమ్మవారికి శ్రీ గరుడ సేవా సమితి భక్త బృందం వారు అలాగే హరే శ్రీనివాస భక్త బృందం వారు లక్ష గాజులలో భాగంగా గాజులు ఊరేగింపుగా సామా కుమారి, చిట్టికుమారి, చేబ్రోలు రాజ సులోచన ఆధ్వర్యంలో తీసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించడం జరి గింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తమ్మన రాధాకృష్ణ మూర్తి, సెక్రట రీ ఎండూరి సురేష్ కమిటీ సభ్యులు కొల్లిపర బాలాజీ, వాసు, అర్చకులు కందుకూరి చిట్టిబాబు, గట్టుపల్లి సాయిచరణ్, చేబ్రోలు బాబీ పాల్గొన్నారు.

## కంచర్ల రామయ్య సంస్మరణ సభలో విక్కుర్తి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ పాత్రికేయులు, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ కంచర్ల రామయ్య సంస్మరణ కార్యక్రమంలో విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు పలువురు ప్రముఖులతో కలిసి పాల్గొన్నారు. కుప్పం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య జూన్ 19వ తేదీన మరణించారు. శనివారం కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో రామయ్య సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి లతో పాటు పలువురు టిడిపి ముఖ్య నేతలతో కలిసి విక్కుర్తి శ్రీనివాస్, రామయ్య పెదకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విక్కుర్తి మాట్లాడుతూ, పాత్రికేయునిగా రామయ్య సేవలను కొనియాడారు. ఈనాడులో పనిచేస్తూ, ఈనాడు రామయ్యగా ప్రసిద్ధిగాంచిన కంచర్ల రామయ్య ఎన్నో ప్రజల సమస్యలను వెలుగులోనికి తెచ్చి, పరిష్కరించిన ఘనత రామయ్యకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా టిడిపి ముఖ్య నేతలతో కొద్దిసేపు ప్రస్తుత రాజకీయాల గురించి విక్కుర్తి చర్చించారు.

# సీసీ కెమెరాలతో నగరపాలక సంస్థ ఆస్తుల పారిశుధ్య నిర్వహణ పర్యవేక్షించండి








**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** సీసీ కెమెరాలతో నగరపాలక సంస్థ ఆస్తుల పారిశుధ్య నిర్వహణ పర్యవేక్షించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం అన్నారు. శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా గవర్నర్పేట, సివిఆర్ కాంప్లెక్స్, సివిఆర్ స్కూల్, పబ్లిక్ టాయిలెట్, బీసెంట్ రోడ్, అన్సారీ పార్క్, గోవిందరాజులు మార్కెట్, విహెచ్ఆర్ కాంప్లెక్స్, మహంతి మార్కెట్, ఐ వి ప్యాలెస్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరపాలక సంస్థ ఆస్తులన్నిటిలో సీసీ కెమెరాలు అమర్చి పారిశుధ్య నిర్వహణ అధికారులు పరిశీలించాలని అన్నారు, భవనాలన్నిటికీను స్ట్రక్చరర్స్ స్టెబిలిటీ సర్టిఫికెట్ ఇంజనీర్లు తీసుకురావాలని, పాత బిల్డింగ్ ల నివేదిక సమర్పించాలని దానికనుగుణంగా వాటి స్థానంలో నగరపాలక సంస్థకు ఆదాయం కలిగించే విధంగా ప్రణాళికను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థకు సంబంధించిన ఆస్తులను పరిశుభ్రంగా ఉండాలని, కర్మలభవనాలు, కళ్యాణ మండపాలు, ప్రజలకు రెంట్‌కు ఇచ్చేటప్పుడు వారికి పరిశుభ్రంగా అందించాలని, అందుకోసం పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఎస్టేట్ అధికారులు నగరపాలక సంస్థకు వచ్చే నెల వారి ఆదాయం కచ్చితంగా వసూలు చేయాలని, అందుకు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ఫీల్డ్ లో తిరిగి డిమాండ్‌కి తగ్గట్టుగా ఆదాయం వసూలు చేయాలని అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే ప్రభుదాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె అర్జున్ రావు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు

### శ్రీ చైతన్య కృష్ణలంక శాఖ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. మహలక్ష్మి







కృష్ణలంక మేజర్ న్యూస్ : స్థానిక శ్రీ చైతన్య కృష్ణలంక శాఖలో నర్సరీ నుండి 5వ తరగతి వరకు ఫాదర్స్ డే వేడుకలు, ఆరు నుంచి పదవ తరగతి వరకు గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. మహలక్ష్మి మాట్లాడుతూ తల్లి దండ్రుల మధ్య గల సంబంధాన్ని - బలపరచడానికి ఈ శనివారం ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలకు తండ్రి యొక్క విశిష్టతను చక్కగా తెలియజేశారు. "తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు" అని ఉద్ఘాటించారు. అలాగే గ్రీన్ ఇండియా మిషన్లో భాగంగా నేటి బాలలతో మొక్కలను నాటించారు. "నేటి బాలలే రేపటి పౌరులు" అనే సామెత ఉన్నది. దీనిలే నేటి బాలలే రేపటి భవితను సాధించే పౌరులు కాబట్టి వారి చేత ఈ వేడుక జరిపించారు. దీనిలో భాగంగా పిల్లలు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే వృక్షో రక్షిత రక్షిత " అనే నినాదాన్ని కూడా చెప్పారు. మొక్కలు మనకు కావలసిన ప్రాణవాయువును ఇస్తాయని, అవి జీవనాధారం అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈ. జి.యమ్. యమ్.మురళి కృష్ణ, ఆర్ఐ జె.రాజేష్ బాబు, అకడమిక్ కో ఆర్డినేటర్ సి.హెచ్ ఇన్ ఛార్జ్ లు, ఉపాధ్యాయులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం






## 7న ఎంఆర్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం వేడుక

**విజయవాడ మేజర్ న్యూస్ :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వం ఎంఆర్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం, ఎంఆర్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ 60వ పుట్టిన రోజు సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలో ప్రతి మాదిగ గ్రామాలలో, విజయవాడ ప్రతి ఏరియాలో ఎంఆర్పీఎస్ జెండా ఆవిష్కరణలు, పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలని, ఎంఆర్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా ఇన్ చార్జ్ ఆదిములపు ప్రకాష్ మాదిగ కార్యకర్తలకు పిలుపునివ్వడం జరిగింది. జిల్లాలో ఎప్పుడు లేని విధంగా నూతన దిమ్మలతో జెండా ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్నారని, ఎస్సీ వర్గీకరణ ఫలాలు, మాదిగ మాదిగ ఉపకులాలకు అందుతున్న ఈ తరుణంలో పండుగ వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతనంగాఎన్నుకున్న ఎంఆర్పీఎస్, ఎంఎస్ పీ అర్బన్ నేతల వివరాలను తెలియజేశారు. ఎంఆర్పీఎస్ విజయవాడ అర్బన్ కన్వీనర్ గా వేల్పుల సురేష్ మాదిగ, ఎంఎస్పీ విజయవాడ అర్బన్ కన్వీనర్‌గా పరసకృష్ణ, ఎంఆర్పీఎస్ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఇంచార్జ్ గా బుదాల విజయ్ మాదిగ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ నెల 6వ తేదీ ఆదివారం ఉదయం రాణిగారితోట బాబు జగజ్జీవన్ రామ్ చౌక్ వద్ద డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నివాళి కార్యక్రమం, అనంతరం అన్నదాన కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో మంద పిచ్చయ్య మాదిక, లింగాల నరసింహులు మాదిగ, మామిడి రాంబాబు మాదిగ, ఇసుకపల్లి చిట్టిబాబు మాదిగ, వేల్పుల సురేష్ మాది, రెడపొంగు ప్రేమ్ కుమార్, రాయవరపు కల్యాన్, వేల్పుల ప్రదీప్ మాదిగ, నిమ్మకూరు మహేష్ మాది, పిల్ల రాజ్ కుమార్, ఐతే మహేష్, మధు మాదిగ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# మద్యం మత్తులో వాహనాలు నడిపిన 85 మంది నిందితులకు కోర్టు కఠిన శిక్షలు

**"మద్యం సేవించి వాహనం నడిపితే కఠినమైన జరిమానాలు...**

**3వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.కిషోర్ బాబు**

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగరంలోని సత్యనారాయణపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 85 మంది నిందితులను కోర్టుకు హాజరు పరచిన నేపథ్యంలో 7వ అదనపు న్యాయమూర్తి-కమ్-రైల్వే మెజిస్ట్రేట్ ఆర్వీ శర్మ, నిందితులపై కఠినమైన శిక్షలు విధించారు. 85 మందికి రూ.10,000 చొప్పున రూ. 8,50,000/- జరిమానా విధించబడింది. గత వారం రోజుల్లో ఐదుగురు నిందితులకు జైలు శిక్షలు కూడా విధించబడ్డాయి. ఈ తీర్పు, మద్యం మత్తులో వాహనాలు నడపడం ఎంత తీవ్రమైన నేరమో, ఎంత కఠినంగా శిక్షలు పడవచ్చో స్పష్టంగా తెలియజేస్తోంది. ఇది కేవలం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాకుండా, రోడ్లపై ప్రయాణిస్తున్న అమాయకుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే తీవ్రమైన నేరంగా కోర్టు పరగణిస్తోంది.

**"మద్యం సేవించి వాహనం నడిపితే కఠినమైన జరిమానాలు**

**3వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.కిషోర్ బాబు**

"మద్యం సేవించి వాహనం నడపడం నేరమని, అట్టి నేరం చేసిన వారికి కఠినమైన జరిమానాలు, జైలు శిక్షలు తప్పవు సత్యనారాయణపురం 3వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కొట్టూరి కిషోర్ బాబు అన్నారు. 85 మంది నిందితులను కోర్టు శిక్ష వేధించిన నేపథ్యంలో శనివారం విజయవాడ ప్రజలకు మీడియా ద్వారా ఆయన సూచనలు తెలియజేశారు. ట్రాఫిక్ నియమాలను పాటించి.. ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ట్రాఫిక్ పై అవగాహన కలిగించేందుకు, నియమాలను పాటించని వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు, అదనపు డీసీపీ (ట్రాఫిక్) ఏవీఎల్.ప్రసన్న



కుమార్, ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించబడ్డాని సీఐ కిషోర్ బాబు తెలిపారు. అదే విధంగా ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ సార్జెంట్ జీవీఎన్ కుమార్, రైటర్ ఆజర్, రాజేష్, సురేష్, జయకుమార్, మణికంఠ, అశోక్, చంటి తదితర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, ఏ.కొండూరు, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999